అన్నీ తెలుసని నీవు చెప్పుకుంటే
నీకేమీ తెలియదని చెప్పేసినట్లే

చిరుదీపం

(నిత్య సత్యాలు)

గర్వం గేలి చేస్తుంది
వినయం మేలు చేస్తుంది

అబద్దానికి తొందరెక్కువ
నిజానికి తర్కమెక్కువ



పి. లక్ష్మణ్‌రావ్

చిరుదీపం

నిత్య సత్యాలు

-: రచన :-

పి. లక్ష్మణ్‌రావ్

ప్రచురణ

జిల్లా రచయితల సంఘం-విజయనగరం

చిరుదీపం

(నిత్యసత్యాలు)

రచన : పి. లక్ష్మణ్‌రావ్

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : 2013

మూల్యం : రూ॥ 15/- లు

కవర్ డిజైన్ & గ్రాఫిక్స్ :
ఫ్రంట్‌లైన్ సర్వీసెస్, విజయనగరం - 2.

డి.టి.పి. & ప్రింటింగ్ :
ఫ్రంట్‌లైన్ సర్వీసెస్,
గురజాడ అప్పారావు రోడ్, విజయనగరం - 2.
ఫోన్ : 08922 - 232777

ప్రతులకు :
పి.లక్ష్మణ్‌రావ్
304, రామకృప టవర్స్,
ఫేజ్ - 3, ఉడాకోలనీ,
కంటోన్మెంట్, విజయనగరం - 535 003.
సెల్ : 94412 15989

అంకితం

నాలో

బీజాక్షరాలు వేసిన

సహృదయ గురువర్యులకు

భక్తి ప్రపత్తులతో.....

పి. లక్ష్మణ్‌రావ్

నా మాట

సమాజం అన్ని విషయాల్లో చైతన్యమైపోయిన ఈ దశలో నీతి బోధలెందుకని కొందరు అనుకోవచ్చు.

కాని లోకం తీరు తెలుసుకోవడం కోసం, మననం చేసుకోవడం కోసం ఇప్పటికీ చాలామంది నీతిశతకాలను చదువు తుండటం, నీతి శతకాలు అనేక పునర్ముద్రణలు గావింపబడు తుండటం మనం చూస్తూనే వున్నాం!

నీతివాక్యాలు చదివినంత మాత్రాన మనుషుల్లో మార్పు వచ్చేస్తుందా ! అంటే రాకపోవచ్చు. కాని మనిషి తప్పు దోవలో నడుస్తున్నప్పుడు ఒక్క నీతి వాక్యం గుర్తొచ్చినా ఆ పని చేయడానికి ఒక అడుగు వెనక్కి వేస్తాడు లేదా ఒక్క క్షణం ఆలోచిస్తాడు. అది చాలు నీతివాక్యాల బలాన్ని చాటడానికి.

నిజానికి ఎవరో ఒకరు ఎప్పటికప్పుడు నీతి, నియమాలను ఏదో ఒక రూపంలో గుర్తు చేస్తుండటం వల్లనే సమాజంలో ఇంకా నీతి శాతం అధికంగా వుంది.

శాస్త్రాలు, సిద్ధాంతాలు ఎప్పటికప్పుడు మారిపోతుండ వచ్చు కాని నీతి వాక్యాల్లో శాశ్వతత్వం ఉంటుంది.

నేను “ఏకాకి గోల” నా మొదటి కవితాసంపుటి (2004)లో ముద్రించిన నిత్యసత్యాలు అనేకమంది పాఠకుల్ని రంజింపజేసాయని నాకు అర్థమైంది.

నానీలు, హైకూలు వంటి ప్రక్రియలు అప్పటికి వున్నాయనే విషయం నాకు తెలియదు. (2004 నాటికి) తెలుసుకున్న తరువాత నేను రాసిన నానీలు, హైకూల సంపుటిల వల్ల నానీలు, హైకూల కవిగా గుర్తింపు వచ్చినప్పటికీ సాధారణ వ్యక్తులు, నా మిత్రులు, బంధువులు, పరిచయస్తులు చాలా మంది మరల నిత్యసత్యాలతో ప్రత్యేకంగా ఒక పుస్తకం ముద్రించమని పదే పదే చెప్పేవారు.

అయితే నానీలు, హైకూలు, మినీ కవితలు, దీర్ఘ కవిత, వచన కవితలు, వ్యాసాలు ఇలా అనేక ప్రక్రియల్లో రచనలు చేసి సంపుటిలు తెచ్చి ఒక స్థాయి దాటిపోయిన కవిగా గుర్తింపు పొందిన తరువాత నిత్య సత్యాలు రచించి సంపుటిగా ముద్రించి మరల వెనక్కి వెళ్ళడమేమిటనే

అహంకారం కొంత అడ్డువచ్చేది.

సామాన్యులు కోరుకునేది, సామాన్యులను చేరేదీ, అసలైన కవిత్వమని, వాళ్ళు నిత్యసత్యాలనే ఎక్కువగా కోరుకుంటున్నారని అర్థమై మరల వారికోసం 'నిత్యసత్యాల'తో సంపుటి వేయడమే మంచిదని గ్రహించి, అహంకారాన్ని దించుకొని ఈ సంపుటితో మీ ముందుకొస్తున్నాను.

అయితే నా భావాల్ని నా ఆలోచనల్ని 203 నిత్యసత్యాల్లో ఇమడ్చాను. ఇంతకు మించి మరల నేను రాయడమంటే భావ దాస్యం, భాషదాస్యం అవుతాయి. అందుకే వీటిని ఇక్కడితో ఆపేస్తాను. మరల పాఠకులు కోరుకుంటే వీటినే పునర్ముద్రణ చేస్తాను గాని కొత్తగా రాసి ప్రయోజనం లేదని భావిస్తున్నాను.

నేను రాసిన ఈ నిత్యసత్యాల్లో కనీసం
ఏ ఒక్కటైనా, ఏ ఒక్కరినైనా చేరితే చాలు !
నా జన్మ ధన్యమైనట్లే !

ఇక చదవండి !

మీ

పి. లక్ష్మణ్‌రావ్

నిత్య సత్యాలు

1. అన్నీ తెలుసని నీవు చెప్పుకుంటే
నీకేమీ తెలియదని చెప్పేసినట్లే

2. అప్పుచేసి గొప్పవద్దు
తప్పుచేసి కప్పవద్దు

3. ఆచరించి బోధించు
ఆదరించి ఉదహరించు

4. గర్వం గేలి చేస్తుంది
వినయం మేలు చేస్తుంది

5. వలువ కప్పుకుంటే అందం
విలువ విప్పుకుంటే దుర్గంధం

6. అబద్ధానికి తొందరెక్కువ
నిజానికి తర్కమెక్కువ

7. ప్రతిభ పరిధి విశాలం
ఈర్ష్య పరిధి వినాశనం

8. కులం విష సంస్కృతి
గుణం దేవుని ఆకృతి

9. కష్టపడితే వస్తుంది గుర్తింపు
ప్రాకులాడితే మిగిలేది ఈసడింపు

10. ఇచ్చిన మాటకు కట్టుబాటు
జగతి చేస్తుంది సమ్రాట్టు

11. విత్తనం పెరిగితే అరణ్యం
పెత్తనం పెరిగితే మాలిన్యం

12. మెరిసేదంతా బంగారం కాదు
మురిసేదంతా ప్రేమకాదు

13. విలువలేని చోట నిలిచియుండకు
అవమానించే చోట అణిగియుండకు

14. కన్నీళ్ళు కరిగిపోతే ఓర్పు
కన్నీళ్ళు తుడిస్తే ఓదార్పు

15. ఎదగనివ్వదు అసూయ
మహాత్ముడ్ని చేస్తుంది భూతదయ

16. అగ్నిపై బురదజల్లిన అపవిత్రంబగునా ?
బురదపై అత్తరు జల్లిన పవిత్రంబగునా ?

17. స్వార్థం నిండిన జీవితం
చీదరింపుతో అంతం

18. అందరిక్షేమం కోరు
అండగా ఉంటుంది ఊరు

19. మంచిని కోరాలి మాటలు
సాయం చేయాలి చేతులు

20. మాటలతో కోటలు కట్టకు
బీటలతో బాటలు వేయకు

21. కాలాన్ని మింగేస్తుంది బద్దకం
మనిషి వికాసానికి పెద్ద అవరోధం

22. తలమాడిపోతున్నా వటవృక్షం
సేద దీరుస్తుంది అనుక్షణం

23. నిన్ను నీవు కుదించుకుంటే చులకన
ఎదుటివాడ్ని హెచ్చిస్తే ఆందోళన

24. మెరుపు వెలుగు క్షణ కాలం
మంచి మిగులు కలకాలం.

25. ఎంత ఎత్తు ఎగిరినా రాబందు
పీనుగుల్నే చూస్తుంది భూమియందు

26. "మంచివాళ్ళం"అనిపించుకోవాలనే ఉద్దేశ్యం
సప్తవ్యసనాలకన్నా పెద్ద వ్యసనం

27. వాస్తవం చెప్పని నోరు
ఒంటరిగానే కడతేరు.

28. మత్తెక్కిస్తుంది శత్రుత్వం
మాధుర్యం నింపుతుంది మిత్రుత్వం.

29. శాంతిని కోరితేనే మనిషి
హింస కోరితే మహిషి

30. ముఖస్తుతి అపార్థానికి చోటు
వ్యక్తిపూజ అనర్థానికి రూటు

31. ఆత్మవిశ్వాసం కాదు బరువు
నింపుకుంటే లేదు కరువు

32. అంతా'నేనే' అనుకుంటే అంతమే నీగతి
అందర్ని గౌరవిస్తే వారి ఆశీస్సులే నీకు ఆస్తి

33. అంతరాలు పెరిగితే అంతమే బంధం
మంతనాలు జరిపి నిలుపుకోవాలి అనుబంధం

34. విద్య, వైద్య వ్యాపారం
ప్రతిభ, ప్రగతికి అగాధం

35. భార్య తప్పుచేస్తే భర్త సంఘంలో నడవలేదు
భర్త తప్పుచేస్తే భార్య బంధంలో ఇమడలేదు.

36. నేరం చేయని వారికి జైలు
నేరం చేసిన వారికి బెయిలు

37. అందమైనది జీవితం
అందుకోలేక పోతే అంధత్వం.

38. పెరిగే కొద్దీ ఒదిగి ఉండటం నమ్రత
తరుగుతున్న జీవితంలో మెప్పుపొందటం ప్రాజ్ఞత

39. ఎన్నడూ చేయకు చెడు స్నేహం
చివరకు మిగిలేది బహుదుఃఖం

40. ఈర్ష్యాద్వేషాలు పతనానికి నాంది
అనురాగ బంధాలు విజయానికి పునాది

41. వదలకుంటే నిద్రమత్తు
అవుతుంది జీవితం సగం చిత్తు

42. అమ్మానాన్నలను ముదిమిలో ఆదరించు
భవితలో నీవూ ముసలేనని గుర్తించు

43. విడిచిపెట్టు వక్రదృష్టి
అలవర్చుకో సమదృష్టి

44. అంతరాలు పెంచుతూ పిల్లల్ని పెంచొద్దు
కుతంత్రాలు నేర్పుతూ విషతుల్యున్ని చేయొద్దు

45. అనుమానం ఛీదరిస్తుంది
అభిమానం ఆదరిస్తుంది.

46. దైవదీవనే ఏడడుగులబంధం
నిత్యం ధ్వనించే ఓంకార నాదం

47. విరహం పాడేది మనసుగానం
మంటల్లో దాగేది నిట్టూర్పుల నాట్యం

48. పశు పక్ష్యాదులపై ప్రేమ
దైవాన్ని దగ్గరచేసే చిరునామా.

49. విజ్ఞానాన్ని నింపే అక్షరం
అజ్ఞానాన్ని చంపే ఆయుధం

50. పేదవాడికి నీవు ఇస్తే రూపాయి
భగవంతుడౌతాడు సిపాయి

51. నిజమైన ప్రతిభకు చేయు జాతర
కపట ప్రతిభకు వేయు ఉక్కుపాతర

52. చీట్లపేకతో ఆడితే జూదం
ఓట్ల పేకతో ఆడితే ప్రజాస్వామ్యం

53. రాయితీవద్దు అడుగు జిరాయితీ
అదోగతివద్దు కోరుకో పురోగతి

54. మంటకేం తెలుసు దేనిని కాలుస్తుందో
మింటికేం తెలుసు దేనిని కూలుస్తుందో

55. మంచితనం చేతగాని తనం కాదు
నిద్రిస్తే మరణించినట్టుకాదు.

56. అహంకారం కళ్ళు తెరవదు
పతనం వరకు విడిచి పెట్టదు.

57. తెగిపోయేది కాదు కడుపుతీపి
ఆగిపోయేది కాదు కాలం గతి

58. చెడును కోరకు
"ముడి"ని వీడకు

59. ఆలి తరపువారు ఆత్మస్వరూపులా?
అమ్మ తరపువారు రాచకురుపులా?

60. అసమర్థుని ఊహలు
విజయం చూడని సందేహాలు

61. బ్రతికించండి బాల్యాన్ని
కష్టాలు తెలియని కాలాన్ని

62. అరచేతిని గాయపర్చిన అగ్నికణం
అరక్షణంలో అయిపోవును ధూళికణం

63. పెంచుకోకు పగ
భరించలేవు దాని సెగ

64. హితం చెప్పేది మతం
మతం పంచేది మానవత్వం

65. ఎదుటివారి లోపాలపై అధికనేత్రం
తనలోని లోపాలపై అంధనేత్రం

66. అంతరాలు పెంచుతుంది డబ్బు
ఆదినుండి దానికదే జబ్బు.

67. ఎవరికి వారు బ్రతకడమెంత కష్టమో
అందరూ కలిసి బ్రతకడమూ అంతే కష్టం.

68. విలువలకు శలవు
కుత్సితాలకు కొలువు.

69. వాస్తవాలకు శిధిల పథం
నకిలీలకు బ్రహ్మరథం

70. నీ చూపులే లోకం కాదు
ప్రకృతి అంటే అడవికాదు

71. పెంచుకోకు ప్రతీకారం
పంచుకో మమకారం

72. నవ్వే బ్రతుకులో కనిపించని వెతలెన్నో
పరిమళించే పుష్పం నిలిచెనెన్ని ముళ్ళకో

73. పగవాడి ఇంటిలో ప్రేమకున్న విలువెంత
ఎండమావి గుండెలో నిండివున్న నీరంత

74. ఆవేశంలో ఆలోచించు
అవకాశాన్ని వినియోగించు.

75. కరుణ లేని గుణమేల?
చరణం లేని గీతమెల?

76. పేదవాని జీవితం అస్థిపంజరం
ధనవంతుని జీవితం ఆస్తి పంజరం.

77. నిప్పు ఎంత కఠినమో, నివురు అంత సున్నితం
పయనమెంత జఠిలమో జీవితం అంత మధురం

78. స్వార్థ చింతన, ఆత్మవంచన
త్యజిస్తేనే మోక్షసాధన

79. అంతంలేని కాలం ఎదలో అంతులేని వ్యథలెన్నో
కడలేని కడలి గర్భంలో తుదిలేని అలలెన్నో

80. వదిలిపెట్టు నిరాశ
లక్ష్యసాధనే నీ ధ్యాస

81. చురుకుదనం గెలుపుకిచోటు
కరుకుతనం భంగపాటు

82. స్వేదం చిందిన శ్రమ
గుర్తిస్తుంది క్షమ

83. క్షణికమైన జీవితానికి మెరుగులేల?
తనది కాని బ్రతుకు కోసం పరుగులేల?

84. చిత్తశుద్ధిలేని ఆరాధ్యం
నీటిమూటవోలె వ్యర్థం.

85. లోకానికి సూర్యుడే సాక్ష్యం
శోకానికి కన్నీరే సాక్ష్యం

86. పెరుగుతున్న మనిషిలో తరుగుతున్న ఆయుష్షు
ఉదయించే సూర్యునిలో అస్తమించే ఉషస్సు

87. లక్ష్యానికి సహకరించు
హక్కులను అనుభవించు.

88. క్షణకమైనది అందం
కలకాలముండేది బంధం.

89. ఊహల్లో విరచిస్తే కాదు కవిత్వం
సత్య శోధన చేయాలి అనునిత్యం

90. వత్తి జారిపోతే వెలుగు ఆరిపోతుంది
ఆత్మ విశ్వాసం కోల్పోతే బతుకు జారిపోతుంది.

91. క్రోధానికి చేయు సమాధి
సహనానికి వేయు పునాది

92. పరాయిపాలనపై ఒక్కటిగా పోరాడాం
స్వతంత్రం తెచ్చుకొని రెండుగా విడిపోయాం

93. ధన, జన, యవ్వనాలతో మిడిసిపాటు
కోల్పోయాక కలుగుతుంది నగుబాటు

94. గాలానికి చిక్కి చేప గిల గిలలాడుతోంది.
ఓటు నోటుకి చిక్కి ప్రజాస్వామ్యం వెలవెల బోతుంది.

95. మనస్సులు గెలిస్తేనే వీరుడు
కడవరకు కొ(ని)లిచే దేవుడు.

96. అనవసర విషయాల్లో తలదూర్చకు
అవమానం ఎదురౌతుందని మర్చిపోకు

97. జాలికలిగిన మనిషే దేవుడు
పూజలందుకోడానికి అర్హుడు

98. మంచినేస్తం పుస్తకం
అంతః శోధనకు కారకం.

99. తను చెబితే సిద్ధాంతం
ఎదుటివాడు చెబితే రాద్ధాంతం.

100. విడిచిపెట్టేది కాదు మరణం
అణగి ఉండేది కాదు జననం.

101. తోటివారిని ద్వేషించడం దుర్భరం
తోడు నీడలా కలిసుండటమే సంబరం.

102. విశ్వమంతా మనిషికి చేరువైంది
హ్రస్వమై మమతానురాగాలకు దూరమైంది.

103. నిందపడినా నిజాయితీ ఓడిపోదు
నిప్పులో పడినా పసిడివిలువ పడిపోదు

104. శాసిస్తే నిలువదు ప్రజాభిమానం
మోహిస్తే తెలియదు ప్రేమానురాగం.

105. ఆశీర్వాదాలు అందలమెక్కిస్తాయి
ఈర్ష్యాద్వేషాలు కుదిస్తాయి.

106. తెగిపోయినా ఆరాటపడుతుంది బంధం
ఆరిపోతున్నా పోరాటం చేస్తుంది దేహం

107. అన్నీ తెలుసని నటించడం
బుద్ధి మాంద్యానికి నిదర్శనం

108. దేశభక్తికి మించిన జాతీయత లేదు
మూఢ భక్తిని మించిన క్షీణతలేదు.

109. సమయానుకూలంగా సర్దుబాటు
మనిషి చేసుకోవలసిన అలవాటు.

110. కొత్తకోణంలో చెప్పడమే కవిత్వం
నిత్యనూతనత్వం దాని లక్ష్యం

111. చిన్న కారణాలకే తక్షణ కోపం
ఎదగని మనసుకు తార్కాణం

112. మేలు మరచుట కుసంస్కారం
కీడు చేయడంతో సమానం.

113. ఎంత తోడినా సముద్రం ఇంకిపోదు
ఎంతరాసినా కవిత్వం ఆగిపోదు.

114. అమ్మా నాన్నలు అనురాగరూపాలు
పిల్లల భవితకు వెన్నెలదీపాలు

115. వదులు కోవడం తేలిక
బదులు చెప్పడం విషగుళిక

116. ధనంతో కొలమానం
మనసుల మాలిన్యం

117. ప్రతిభను ప్రోత్సహించే గుణం
నిస్వార్థానికి ప్రతిరూపం.

118. కులాన్ని వదలనివాడు మనిషిగా ఎదగలేడు
మతాన్ని వీడనివాడు దైవాన్ని చూడలేడు.

119. భయం ఇవ్వదు అభయం
ధైర్యం ఎరుగదు అపజయం.

120. ఆలుమగలు ఇద్దరూ సమానమే
అధికారం ఒక్కరిదైతే మరొకరిది నరకమే

121. దాంపత్యమంటే సర్దుబాటు
దాని లక్ష్యం దిద్దుబాటు

122. వ్యసనం కోసం ఖర్చుచేయడం
చితిని పేర్చుకొని తగులబెట్టుకోవడం

123. స్వార్థం సంపద వెతుకుతుంది
నిస్వార్థం నిరుపేదగ ఉండిపోతుంది.

124. అంతస్థు చిహ్నాలుకాదు ఆర్భాటాలు
అప్పుల ఊబిలో మునిగే ఆక్రందనలు.

125. చిన్న పొరపాట్లు కూడా మ్రోగిస్తాయి ప్రమాద ఘంటికలు
నేర్చుకోవడమే విజ్ఞత అనుభవపాఠాలు

126. కఠినమైతే ఆవేశం
ఒంటర్ని చేస్తుంది సమాజం

127. ఆలోచన లేని ఆవేశం
మిగులుస్తుంది అపరాధం

128. దుష్ప్రచారం అసమర్థుల బుద్ధి
నిజం తెలిస్తే లోకవిరోధి

129. కన్నీరు తుడిస్తే గొప్పతనం
కంటి తుడుపు డొల్లతనం

130. స్థిరాభిప్రాయం లేనివాడు
సుస్థిరస్థానం పొందలేడు

131. సొంత మనుకున్నదంతా అంతమైపోతుంది
పెనవేసుకున్న బంధం తుదికి విడిపోతుంది

132. అంతా మంచే అనుకుంటే లోకం దాసోహం
కన్నెర్ర జేస్తే లభించదు సహకారం

133. అతిమంచితనం వ్యక్తిగత అనర్థం
అవతలివ్యక్తికి బహుప్రయోజనం

134. విజ్ఞాన కుసుమం పరిమళిస్తేనే అందం
సమాజానికి అవుతుంది మైత్రీబంధం

135. బలహీనుల్ని హింసించి బలవంతుడవు కావద్దు
కన్నీరు త్రాగి దప్పిక తీర్చుకోవద్దు

136. ప్రతిభను దాచుకునేవాడు ద్రోహి
సమాజాన్ని ఎదగనివ్వని విద్రోహి

137. తనను చులకన చేస్తే అసంతృప్తి
ఎదుటివాడ్ని చులకన చేస్తే బహుతృప్తి

138. స్వచ్ఛమైన మాటలు పంచుతాయి మమతలు
గూడార్థాలు, పెడర్థాలు పెంచుతాయి అంతరాలు.

139. విమర్శలతో మనిషి ఎదగలేడు
విసుర్లతో విశ్వాన్ని గెలవలేడు

140. విలువలేదని బాధపడకు
శిల, శిలువ దేవుళ్ళైనని మర్చిపోకు

141. తృణీకరిస్తే తృణమైపోవు
బొగ్గులో వజ్రమై రాణిస్తావు

142. రాళ్ళతో కొట్టినా చెట్టు ఫలాల్నే ఇస్తుంది
సిరల్ని పిండుతున్నా ఆవు పాలనే ఇస్తుంది

143. గాలిని బంధిస్తే బాంబులా పేలుతుంది
మంచిని నిందిస్తే క్రోధమై ఊగుతుంది

144. ఆధారపడితే కోల్పోతావు ఔదార్యం
స్వతంత్రుడవైతే నిలుస్తుంది ఆత్మగౌరవం

145. జీవమంతా మంచి చెడుల సమాహారం
ధరిత్రియంతా దివారాత్రుల విహారం

146. బంధం నిలుపుకోవడం గొప్ప కళ
అనుబంధం తెంపుకుంటే పీడకల

147. బద్ధకానికి అశ్రద్ధ మిత్రుడు
లక్ష్యానికి అవిశ్వాసం శత్రువు

148. కలం ఆలోచనల్ని పిలుస్తుంది
కత్తి ఆవేశాన్ని ఒలుస్తుంది

149. వెలుతురులో చూసినా నిజంపై అనుమానాలే
గుప్పెట్లో మూసివున్నా అబద్ధంపై ఆకర్షితులే

150. మనసును విరిచేస్తే మనిషి రాలిపోయినట్టే
నరికిన చెట్టు నిలువునా కూలినట్టే

151. తెలిసి తప్పు చేసినోడు పతనానికి సిద్ధుడు
తెలియక తప్పు చేసినోడు క్షమించడానికి అర్హుడు

152. ఏడ్చేలోకం ఏడుస్తూనే చస్తుంది
ఏడడుగుల బంధం ఏడ్చేవారికి లొంగనిది

153. డబ్బులేనినాడు అంతర్మథనం
డబ్బున్ననాడు అహంకారమదం

154. ఒప్పుని ఒప్పుకునే సందర్భాలు తక్కువ
తప్పుని క్షమించలేని మనుషులే ఎక్కువ

155. పాఠాలు నేర్చుకొని గుణపాఠం చెప్పాలి
పటుత్వం పెంచుకొని పసిడిలా రాణించాలి

156. చెప్పుడు మాటలే వింటుంది లోకం
చూపుడు వేలే చూపుతుంది నిత్యం

157. ఋణాలకు కారణం జీవనపోరాటం
ధనం లేని జీవనం సమస్యల తోరణం

158. బంగారం కనబడదు చిమ్మచీకటిలో
మంచి అయినా అంతే అబద్ధాల కొలువులో

159. చూపుల్ని బంధిస్తాడు చంద్రుడు
చూస్తే ఖండిస్తాడు సూర్యుడు

160. ఏడిపిస్తూ కూడబెట్టిన ధనం
కన్నీటిని సేవించిన కర్కశం

161. వలసపోయింది మన సంస్కృతి
వరదలా వస్తుంది విష సంస్కృతి

162. విలువ పెంచుతుంది సమయపాలన
మెదడుని భక్షిస్తుంది నిరీక్షణ

163. అనర్హులకు గౌరవం ఇవ్వొద్దు
అధముల్ని నెత్తిమీద ఉంచొద్దు

164. ఎగతాళి అయిపోతున్నది తాళి
బంధం సున్నితమని గుర్తించాలి

165. డబ్బుని మించిన గౌరవం లేదు
జబ్బుని మించిన నరకం లేదు

166. ఇవ్వడానికి వెనుకంజవేసే మనసు
పొందడానికి ఆతృత పడుతుందని తెలుసు

167. పెరుగుతున్న ధరలకు జేబులు చిల్లు
కొనుగోలు శక్తి పడిపోయి గుండె గగ్గోలు

168. ఉపన్యాసంలో వీరావేశం ఉండకూడదు
సన్యాసంలో కామావేశం పొందకూడదు

169. సృజనాత్మకతతోనే కవి రాణిస్తాడు
సూర్యకాంతితోనే ప్రకృతి వికసిస్తుంది

170. పసిపిల్లలు ప్రకృతి అందాలు
పనిపిల్లలైతే అవుతారు జీవచ్ఛవాలు

171. అభిమానించినప్పుడు అనుమానించకు
అభినయిస్తే అభిమానించకు.

172. నిశిని చీల్చే కిరణం
జీవజాలానికి కారణం

173. విశ్వా(సా)న్ని వివరించే కవి
వెలుగుని విరజిమ్మే రవి

174. ప్రయాణాల్లో ప్రతివాదనలొద్దు
ప్రణయాల్లో అతి ఆరోపణలొద్దు

175. దోచుకోవడం అనాగరికం
పంచుకోవడం సంబరం

176. వ్యసనం వ్యక్తిగతంగా హానికరం
బంధాల్ని చేస్తుంది వినాశనం

177. బాలల పేదరికం
భావితరానికి ప్రశ్నార్థకం

178. నమ్మకద్రోహం చాపక్రింద నీరు
కాటేసే విషపడగలతోడు

179. తప్పుని నిలదీస్తే నిరాదరణ
తప్పించుకు తిరిగితే సమారాధన

180. విచక్షణ లేని ఖర్చు
జీవితమంతా కార్చిచ్చు

181. భవిష్యత్తు కోసం ఆదా
జీవితానికి సుఖమయ పరదా

182. పనులు వాయిదా వేసినోడు
జీవితకాలం అయోగ్యుడు

183. ఆరంభించకు పనులు శంకించి
ప్రారంభంలోనే దక్కదు విజయసిద్ధి

184. నిరంతరం ఉపయోగపడటం అవివేకం
పరస్పర సహకారం లేకపోతే నిరర్థకం

185. బోధిస్తే రాదు సమానత్వం
ఆచరించి తీరాలి అనునిత్యం

186. గత్యంతరం లేకపోతే సంధియే నయం
అహంకారానికి పోతే వినాశనం ఖాయం

187. నీ కోసం మారేది కాదు లోకం
ఒంటరి బతుకులెన్నో అందుకు సాక్ష్యం

188. అవకాశాన్ని శత్రువుకి విడిచిపెట్టకూడదు
ఆత్మీయుల అవకాశాన్ని తుడిచిపెట్టకూడదు

189. ఖాతరు చేస్తే బెట్టు చేస్తుంది లోకం
బేఖాతరు చేస్తే దాసోహమని నిలుస్తుంది

190. గండ్లు, కడగండ్లే రైతుల పరిస్థితి
ఉన్నతస్థితి రాక ఉన్న స్థితి పోయే తిరోగతి

191. సఫలమైతే ప్రేమవీడని బంధం
విఫలమైతే విషనాగు సుమా !

192. కోల్పోయిన జీవితాన్ని మరచిపో
మిగిలివున్న జీవితంలో మేలుకో

193. మనసులో విషంతో మోమున నవ్వులొద్దు
మంచివారి నెప్పుడూ వంచన చెయ్యొద్దు

194. చెప్పేవాడికి వినేవాడు లోకువ
పెట్టేవాడికి తినేవాడు అణకువ

195. నిజం పలకనోడు
సమాజానికి పనికిరాడు

196. పలకరింపులో చిరునవ్వు
మనసును దోచే మల్లెపూవు

197. పేదరికం చేస్తుంది భిక్షాటన
మానవ సమాజం సిగ్గుపడాల్సిన ఘటన

198. నాగరికత అంటే విశ్వం విశాలమవ్వడం కాదు
మనుషుల మనసు విశాలమవ్వడం

199. సమయానుకూల సంభాషణ విజయానికి మెట్టు
వృథా ప్రేలాపన గౌరవానికి చేటు

200. వర్గదోపిడీ నిన్నటి మాట
మనిషిని మనిషే దోపిడీ నేటిమాట

201. అమ్మాయిల శాతం తగ్గుతుందా
అమ్మల శాతం కూడా తగ్గుతున్నట్లే !

202. అలుపెరుగనిది కాలం
స్వీయప్రగతి దాని మూలం

203. మాతృభాషపై మమకారం
మనిషిగా ఎదుగుదలకు సహకారం

బయోడేటా

పేరు	:	పి. లక్ష్మణ్‌రావ్
ఊరు	:	సంగీత సాహిత్యాలలో "నవరసాలూరు" సాలూరు, విజయనగరం జిల్లా
చదువు	:	సంస్కృతి - వారసత్వం మనుషులు - మనసులు ప్రకృతి - పరిసరాలు పురస్కారాలు - తిరస్కారాలు అవమానం - రాజపూజ్యం
వృత్తి	:	'అందరికోసం ఒక్కడు - ఒక్కడికోసం అందరు' నినాదమే ధ్యేయమైన ఆంధ్రప్రదేశ్ సహకారశాఖలో, అసిస్టెంట్ రిజిస్ట్రార్, విజయనగరం జిల్లా.
ముద్రితములు	:	1) ఏకాకిగోల (కవితా సంపుటి) 2) నావి-నీవి (నానీలు) 3) భావచిత్రాలు (హైకూలు) 4) ఋతువిహంగం (హైకూలు - అక్షర నియమంతో) 5) అగ్నివృక్షం (దీర్ఘ కవిత) 6) తీరని దాహం (నానీలు) 7) మెరుపు శబ్దం (మినీ కవితలు) 8) కొంచెం నిప్పు - కొంచెం నీరు (సాహిత్య వ్యాసాలు) 9) దగా దగా - ధగ ధగ (సామాజిక వ్యాసాలు) 10) ప్రవర్తన - పరివర్తన (చింతన వ్యాసాలు) 11) గాజుముక్క (వచన కవిత్వం) 12) నీటిబొట్టు (నానీలపై సమీక్షా వ్యాసాలు) 13) గురువుజాడ - గురజాడ (సమీక్షా వ్యాసాలు)

-: అవార్డులు :-

1) రంజని-కుందుర్తి, 2005

2) ఆంధ్రప్రదేశ్ స్వర్ణోత్సవ జిల్లా పురస్కారం-2006

3) యువకవి ప్రతిభా పురస్కారం 2008,
సాహితీమిత్రులు, మచిలీపట్నం

4) ఉడా, విశాఖ ఉగాది పురస్కారం 2007. (సర్వజిత్)

5) ఉడా, విశాఖ ఉగాది పురస్కారం 2008. (సర్వధారి)

6) అధికార భాషా సంఘం, హైదరాబాద్ వారిచే
భాషా సత్కార పత్రం 2008

7) భారతీ తీర్థ (యు.ఎస్.ఎ), (విజయనగరం) వారిచే
జిల్లా కలక్టరు వారి ద్వారా సన్మానం 2009

8) ఆంధ్రసారస్వతసమితి, మచిలీపట్నం వారి
ఉగాది పురస్కారం 2010 (వికృతి)

9) మానాన్న రాష్ట్రస్థాయి కవితల పోటీలో తృతీయ బహుమతి 2010

10) ఇండియన్ హైకూ క్లబ్, అనకాపల్లి వారి
ఉత్తమ వ్యాసరచయిత అవార్డు 2010

11) చైతన్యభారతి-గజపతినగరం ఉగాది పురస్కారం 2011. (శ్రీఖర)


12) గాజుముక్క కవితా సంపుటికి ఎస్.వి.డి. సాహితీ సంస్థ, హైదరాబాద్
తృతీయ ఉత్తమ దీపావళి పురస్కారం 2011.

13) ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా జిల్లా పురస్కారం 2012.

-: ఇతరములు :-

1) గురజాడ 150వ జయంతి సందర్భంగా విజయనగరం జిల్లా యంత్రాంగం రూపొందించిన "ఒకటిన్నర శతాబ్ధాల గురజాడ" ప్రత్యేక సంచికకు ప్రధాన సంపాదకులలో ఒకరిగా.

పుణ్య పూర్వీకులు




ముత్తాత గారు

రాజ వైద్యులు



తాత గారు

దీనజన సేవకులు



నాన్న గారు

చంటిపిల్లల నిపుణులు

(ఆయుర్వేదం)

Chirudeepam

అన్నీ తెలుసని నీవు చెప్పుకుంటే
నీకేమీ తెలియదని చెప్పేసినట్లే !

- పి. లక్ష్మణ్‌రావ్

